
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

3

సోమవారం 4 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.145	215	244
సూర్యాపేట	రూ.165	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 23.8

ఎంపీ టికెట్లపై కసరత్తు



- తొలి జాబితా విడుదల చేసిన బీజేపీ
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ఒత్తిడి
- కాంగ్రెస్ టికెట్ కోసం యువనేతల పోటాపోటీ
- తమకు చాన్స్ ఇవ్వాలంటున్న బీసీ నేతలు
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేకి బీజేపీ గాలం
- నల్లగొండ ఎస్టీలకు ఇవ్వాలని బీఆర్ఎస్ కీలకనేతల ప్రతిపాదన

రాజకీయపార్టీల్లో లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో బీజేపీ గతానికి భిన్నంగా ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అభ్యర్థుల తొలి జాబితా ను విడుదలచేయడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ఒత్తిడి పెరిగింది. బీజే పీ ప్రకటించిన తొలిజాబితాలో ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లలో ఒకటైన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పేరును ప్రకటించడంతో సామాజిక సమీకరణాలూ తెరపైకి వచ్చాయి. నల్లగొండ స్థానానికి బీజేపీ ఎవరిని ఎంపికచేస్తుందనే అంశంతో పాటు, రెండు సీట్లలో అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎలాంటి వ్యూహాలు అనుసరించనున్నాయనే అంశంపై అందరి దృష్టి నెలకొంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లపై దృష్టిసారించిన బీజేపీ, భువనగిరి అభ్యర్థిగా తొలి జాబితాలోనే మాజీ ఎంపీ, బీసీనేత డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పేరును ప్రకటించింది. నల్లగొండ స్థానానికి అభ్యర్థిగా బలమైన వ్యక్తిని బరిలోదింపేందుకు కసరత్తు చేస్తోంది. పార్టీ సీనియర్ నేతలు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, నాగం వర్షిత్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి నల్లగొండ టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు అధిష్ఠానం జనాదరణ కలిగిన నేతలు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలపై కన్నేసినట్టు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రధానంగా సాగర్ ఆయకట్టు ప్రాంతానికి చెందిన ఒక మాజీ ఎమ్మెల్యేతో బీజేపీ కీలకనేతలు చర్చించారని, పార్టీలోకి వస్తే ఎంపీగా అవకాశం కల్పిస్తామని ప్రతిపాదించగా, సదరు మాజీ ఎమ్మెల్యే ముఖ్యఅనుచరులు, సన్నిహితులతో ఈ విషయమై సమాలోచనలు చేసినట్టు తెలిసింది. అదే విధంగా బీసీ వర్గానికి చెందిన కీలకనేత, నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి గత ఎన్నికల్లో పోటీచేసి గణనీయ ఓట్లు సాధించిన పిల్లి రామరాజు యాదవ్ అభ్యర్థిత్వంపైనా బీజేపీలో చర్చ సాగుతోంది. నల్లగొండ స్థానం నుంచి కూడా బీజేపీ బలమైన అభ్యర్థినే బరిలో దించనుంది.

బీఆర్ఎస్ అభ్యర్థులెవరో?

లోక్‌సభ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపాలనే వ్యూహంతో ఉన్న బీఆర్ఎస్ పలు సమీకరణాలపై చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి ఇటు నల్లగొండ, అటు భువనగిరి నియోజకవర్గాల్లో అధిష్ఠానం ఎక్కడ అవకాశమిస్తే అక్కడ పోటీచేసేందుకు సిద్ధమని ప్రకటించడంతో పాటు, ఇప్పటికే రెండు నియోజకవర్గాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నల్లగొండ స్థానం నుంచి అమిత్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ తేరా చిన్నపరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి సైతం టికెట్ కోసం పోటీపడుతున్నారు. అయితే ఈ స్థానంలో గిరిజనుల ఓట్లు అధికంగా ఉన్నందున, ఆ సమాజికవర్గానికి చెందిన నేతను బరిలో దింపడం ద్వారా కాంగ్రెస్, బీజేపీని సులభంగా ఢీకొట్టవచ్చని భావిస్తున్న బీఆర్ఎస్‌లోని కీలకనేతలు ఈ సమీకరణాలపై అధిష్ఠానంతో చర్చిస్తున్నారు. ఈ సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, డాక్టర్ మాతృనాయక్, రాంచందర్‌నాయక్, వడ్త్యా రమేష్‌నాయక్ తదితర నేతల పేర్లను అధిష్ఠానానికి కీలకనేతలు సూచిస్తున్నారు. భువనగిరి స్థానం నుంచి గుత్తా అమిత్‌రెడ్డితో పాటు, తెలంగాణ ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్, పైళ్ల శేఖర్‌రెడ్డి టికెట్ కోసం బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి సైతం టికెట్లను కీలకనేతలే ఆశిస్తుండడంతో, అధిష్ఠానం అభ్యర్థులను త్వరగా తేల్చాలని క్యాడర్ కోరుతోంది.

బీజేపీలోకి రమ్మన్న మాట వాస్తవమే

హుజూర్‌నగర్: బీజేపీలోకి తనను రమ్మని ఆ పార్టీ కోరిన మాట వాస్తవమే. కానీ వెళ్లే ఆలోచనలేదు. పార్టీ మారే ఆలోచన అంతకన్నా లేదు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పనిచేస్తా. బీఆర్ఎస్ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటా.

- సైదిరెడ్డి, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో ఉత్కంఠ

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఘన విజయం సాధించిన కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్లు ఎవరికి వరిస్తాయనే అంశంపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. యువనేతలు పోటాపోటీగా అధిష్ఠానం వద్ద లాబీయింగ్ చేస్తుంటే, అధిష్ఠానం మాత్రం సీఎం, మంత్రులు, కీలకనేతల అభిప్రాయాలతో పాటు, సునీల్‌కనుగోలు నివేదిక ద్వారా అభ్యర్థిని ఎంపికచేసే ప్రక్రియను ముమ్మరం చేసింది. నల్లగొండ స్థానం నుంచి తన కుమారుడు పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డికి టికెట్ ఇప్పించేందుకు మాజీ మంత్రి జానారెడ్డి అధిష్ఠానం వద్ద పావులు కదుపుతున్నారు. మరోవైపు తనకు ఏఐసీసీ ముఖ్యనేతలు ఇచ్చిన హామీ ప్రకారం టికెట్ వస్తుందనే విశ్వాసంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి ఉన్నారు. సామాజిక సమీకరణాల ప్రాధాన్యంలో తనకు అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు కే.శంకర్‌నాయక్ అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఈ స్థానం కోసం కీలకనేతలు పోటీ పడుతుండటంతో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం పార్టీ వర్గాల్లో ఆసక్తిరేపుతోంది. భువనగిరి సీటుకు బీజేపీ ఇప్పటికే బీసీ నేతను అభ్యర్థిగా ప్రకటించడంతో కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుందనే అంశం చర్చనీయాంశమైంది. భువనగిరి నియోజకవర్గంలో మూడు పర్యాయాలూ కాంగ్రెస్ నుంచి కోమటిరెడ్డి బ్రదర్స్ బరిలో దిగితే, రెండుసార్లు విజయం సాధించారు. ఈసారి కూడా ఈ కుటుంబానికి చెందిన డాక్టర్ సూర్యపవన్‌రెడ్డి టికెట్ ఆశిస్తుంటే, పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి టికెట్ కోసం బలంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు బీసీ నినాదంతో పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ తనకు టికెట్ ఇస్తే గెలుస్తానని, అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ నేతలతో పాటు రాష్ట్ర మున్సిపల్ చైర్మన్స్ ఛాంబర్ అధ్యక్షుడు వెన్‌రెడ్డి రాజు, తీన్మార్ మల్లన్న సైతం టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

విరబూసిన విద్యాకుసుమాలు

కన్నవారి కలలు నిజం చేసిన పేదింటి బిడ్డలు

ఓవైపు పనిచేస్తూనే.. మరోవైపు పట్టువదలని సంకల్పం

ఒకటి.. రెండు.. మూడు.. ఇలా పలు ఉద్యోగాలకు ఎంపిక

రాష్ట్రస్థాయిలో మొదటి.. ద్వితీయ.. తృతీయ ర్యాంకులు

గురుకుల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి జిల్లావాసులు



సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకుంటున్న రమావత్ అంజలి (ఫైల్)

పుట్టింది పేదరికంలో.. అయినా పెద్ద విజయాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలెన్నో. తినడానికి మూడు పూటలా తిండి కూడా దొరకని దీనస్థితి. ఒక్కొక్కరిది ఒక్కో గాథ. కూలీనాలి చేసి కుటుంబ పోషణ కోసం వలసలు వెళ్లి పిల్లలను చదివించిన వారు కొందరు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయినా.. ధైర్యంగా ఉంటూ పిల్లలని పెంచి పెద్దచేసి, ఉన్నత చదువులు చదివించిన తల్లులు మరికొందరు. ఓ తల్లి తన కుమారుడి చదువుకు ఉన్న కొద్దిపాటి బంగారం అమ్మితే.. మరో తల్లి తన ఇద్దరు బిడ్డలను చదివించేందుకు కూలీనాలి చేస్తూనే.. కుట్టు మిషన్ కుడుతూ ఒక్కో రూపాయి పోగేసింది. వీరందరి లక్ష్యం ఒక్కటే.. తాము పుట్టింది పేదరికంలో అయినా.. బతికేది పేదరికంలో కాకూడదన్నది. అందుకే అటు తల్లిదండ్రులు.. ఇటు పిల్లల లక్ష్యం కష్టాల కడలిని జయించి, విజయకేతనం ఎగురవేయాలని. అనుకున్నది నిజమైంది. ఏళ్ల తరబడి నిరీక్షణ ఫలించింది.. ఉద్యోగ సాధనతో కన్న కలలు నిజం చేసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా గురుకుల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన వీరుల విజయగాథలు..

•5లో..

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష



నల్లగొండలో పరీక్షాకేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్‌సీవో షకీనా

నల్లగొండ టౌన్, మార్చి 3: మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ ప్రవేశపరీక్షకు మొత్తం 9,917 మంది విద్యార్థులకు 8,924 మంది (89.99 శాతం) హాజరు కాగా, 993 మంది గైర్హాజరయ్యారు. నల్లగొండ జిల్లాలో 5,831 మందికి 5,282 మంది హాజరు కాగా 569 మంది గైర్హాజరయ్యారు. సూర్యాపేట జిల్లాలో 2,657 మందికి 2,386 హాజరు కాగా, 271 మంది గైర్హాజరయ్యారు. యాదాద్రి జిల్లాలో 1,429 మందికి 1,276 మంది హాజరు కాగా 153 మంది గైర్హాజరయ్యారు. నల్లగొండలోని పలు పరీక్షా కేంద్రాలను గురుకులాల ఆర్‌సీవో ఎం.షకీనా, ప్రిన్సిపాల్ టి.భిక్షమయ్య పరిశీలించారు.

తప్పుడు చిరునామాతో...

గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్‌లో ఇచ్చిన తప్పుడు అడ్రస్‌తో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల తప్పిదానికి కొందరువిద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని ప్రేరణ కాన్సెప్ట్ స్కూల్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటుచేయగా, హాల్‌టికెట్‌లో ప్రేరణ స్కూల్, దేవరకొండ, నల్లగొండ అని తప్పుగా పడటంతో కొందరు విద్యార్థులు దేవరకొండకు వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక ఈ సెంటర్ నల్లగొండలో ఉందని తెలపడంతో కొందరు తిరిగి నల్లగొండకు చేరకొని పరీక్షకు హాజరుకాగా, మరికొందరు పరీక్షను రాయలేకపోయారు.ఈవిషయాన్ని ఆర్‌సీవో షకీనా దృష్టికి తీసుకెళ్లగా,హాల్‌టికెట్‌లో చిరునామా తప్పుగా పడినప్పటికీ, తాము ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి పరీక్షా కేంద్రం చిరునామాను తెలియజేశామన్నారు. ఆ సెంటర్‌లో విద్యార్థుల హాజరుశాతం బాగానే ఉందని, మొత్తం 240మందికి 204మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.



నల్లగొండలో ఓ పరీక్షాకేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

కొనసాగుతున్న అంతర్‌జిల్లా కబడ్డీ పోటీలు



పోటీల్లో తలపడుతున్న నల్లగొండ, ఖమ్మం జట్లు

నాగార్జునసాగర్, మార్చి 3: సాగర్ బీసీ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు జరిగే అంతర్‌జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో మ్యాట్‌పై నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహించారు. రెండో రోజు పోటీలను రాష్ట్ర ఒలింపిక్ జనరల్ సెక్రటరీ కే.జగదీశ్వర్‌యాదవ్ పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరాములు, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్, అజీజ్‌ఖాన్, సత్తయ్య, భూలోకరావు ఉన్నారు.

వందేళ్ల సేవలు అభినందనీయం



వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ముగిసిన ఆర్య సమాజం వందేళ్ల వేడుకలు

నల్లగొండ కల్చరల్, మార్చి 3: ఆర్య సమాజ మందిరం వందేళ్ల సేవలు అభినందనీయమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామగిరిలోని ఆర్యసమాజ మందిర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహార్షి దయానంద సరస్వతి ద్విశత జయంతి ఉత్సవాలు, ఆర్యసమాజ మందిర వందేళ్ల పండుగ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దయానంద సరస్వతి సమాజానికి అందించి ధర్మ సూత్రాలను ఆచరించాలన్నారు. వంద సంవత్సరాల నుంచి ఆర్యసమాజ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆర్య సమాజ మందిరానికి కావాల్సిన వసతులు, ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా గోషాలకు స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఉత్సవాల్లో మూడో రోజు కూడా గురుకులాల ఆచార్యులు, విద్యార్థినీ, విద్యార్థులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ యజ్ఞాన్ని నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు ఈ యజ్ఞం సాగగా, కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, స్వామి ప్రణవానంద సరస్వతి, స్వామి ఆర్యవేశ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రిని ఆర్య సమాజ మందిరం నిర్వాకులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా మూడు రోజు పాటు నిర్వహించిన ఉత్సవాలకు హాజరైన ప్రతినిధులను మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్ రావు, జిల్లా అధ్యక్షుడు బోయపల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శి జె.గోపాల్‌రెడ్డి, ఉపకార్యదర్శి యర్లమల్ల లక్ష్మీనరసింహ, కంది సూర్యనారాయణ, నాగులపల్లి శ్యాంసుందర్, కంది మట్టపల్లి, కె.శంకర్, రవీ ప్రసాద్, నల్లగొండ పండితులు శక్తి నందన్, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

నల్లగొండ టౌన్: ఐదేళ్ల లోపు పిల్లలు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మాన్యంచెల్క అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో సుమారు 1,61,925 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అధికారులు 981 కేంద్రాలను ఏర్పాటు చేసి, 3,924మంది ఉద్యోగులను కేటాయించారన్నారు. అంతకుముందు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో చిన్నారులకు మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమాల్లో కలెక్టర్ హరిచందన, డీఎంహెచ్‌వో డాక్టర్ కొండల్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జమీర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానంద, ఎంసీహెచ్ పీవో అరుంధతిరెడ్డిపాల్గొన్నారు.

హామీలను 90 రోజుల్లోనే అమలు చేస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1 నుంచి అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద జీరో విద్యుత్ బిల్లులపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బైక్‌పై ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మాన్యంచెల్క, హైదర్‌ఖాన్‌గూడా, రహమత్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి గృహజ్యోతి విద్యుత్ వినియోగదారులతో మాట్లాడారు. గృహజ్యోతి కింద జిల్లాలో 1.82లక్షల మంది లబ్ధిపొందుతున్నారని తెలిపారు. మామిళ్లగూడెంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో మాన్యంచెల్కలోని అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌కు కొత్త భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రవి, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పూర్తి చేస్తాం

తిప్పర్తి, కనగల్: ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని రెండేళ్లలో పూర్తి చేసి రైతులకు సాగునీటిని అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిప్పర్తి మండల పరిధిలోని మర్రిగూడెం, కనగల్ మండల కేంద్రంలో విద్యుత్ జీరో బిల్లు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీ, తహసీల్దార్ డి.స్వప్న, విద్యుత్‌శాఖ డీఈ నాగయ్య, ఏఈ రమ్య, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, పార్టీ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, యూత్ అధ్యక్షుడు బద్ధం సుధీర్, జూకటి మోష, రొట్టెల రమేష్, నాగరాజు, నలపరాజు శ్రీనివాస్, ఎండీ బాబర్, ఆదిమూళ్ల ప్రశాంత్, ఎద్దు ఉపేందర్, మం దడి రామచంద్రారెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, అంజిరెడ్డి, భారతివెంకటేశం, హఫీజుద్దీన్, కె.అంజిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, రాజారెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, నర్సింగ్ మురళిగౌడ్, లక్ష్మయ్యగౌడ్‌పాల్గొన్నారు.



మర్రిగూడెం గ్రామంలో పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో ఎండిన వరి పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నకిరేకల్, మార్చి 3: ఈ ఏడాది వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటడంతో వరి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఎండిన రైతుల పంట పొలాలను సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు బావులు ఎండిపోయాయన్నారు. దీంతో పొట్ట దశకు వచ్చిన వరి పొలాలు ఎండి రైతు లు, కౌలు రైతులు నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయికి పంపి పంట నష్టాన్ని పరిశీలించి రైతులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాళ ప్రమీళ, వీరపల్లి వెంకటేశ్వర్లు, బండా శ్రీశైలం, మర్రి వెంకటయ్య, కొప్పుల అంజయ్య, బచ్చుపల్లి ప్రకాష్ రావు, లక్ష్మణ్‌రావు, దోరెపల్లి యల్లయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోటల్ యజమాని మృతి


రాఘవేంద్రశెట్టి(ఫైల్)

దేవరకొండ, మార్చి 3: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉడిపి హోటల్ యజమాని మృతిచెందాడు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన అయ్యప్పస్వామి గురుస్వామి నారాయణస్వామి 30సంవత్సరాలుగా దేవరకొండలో ఉడిపి హోటల్ నడుపుతున్నాడు. ఆయన ఐదు సంవత్సరాల క్రితం శబరిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందాడు. అనంతరం ఆయన కుమారుడు రాఘవేంద్రశెట్టి(43) దేవరకొండలో ఉడిపి హోటల్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం రాత్రి స్కూటి వాహనంపై ఉడిపి హోటల్ నుంచి కల్వకుర్తి రోడ్డువైపు వెళ్లి తిరిగి హోటల్‌కు చేరుకుంటుండగా కల్వకుర్తి నుంచి కొండమల్లేపల్లి వైపు వెళుతున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాఘవేంద్రశెట్టి తలకు తీవ్రగాయాలు కాగా దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రాఘవేంద్రశెట్టికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మరో ప్రమాదంలో యువకుడు

కట్టంగూరు: నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో చెరువుఅన్నారం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. అయిటిపాముల గ్రామానికి చెందిన సున్నపు రాజశేఖర్(23) బైక్‌పై నకిరేకల్‌కు వెళ్లి తిరిగి అయిటిపాములకు వస్తుండగా నకిరేకల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ డ్రైవర్ లారీని అతివేగంగా నడిపి ముందుగా వెళ్లుతున్న బైక్‌ను ఢీకొంది. దీంతో రాజశేఖర్‌కు తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాజశేఖర్ సోదరుడు శివ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడవిలో మంటలు.. అదుపు చేసిన అటవీశాఖ సిబ్బంది

నాగార్జునసాగర్, మార్చి 3: నాగార్జునసాగర్ అటవీ శాఖ డివిజన్ పరిధిలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు చింతలపాలెం బీట్‌లో ఆదివారం సాయంత్రం అడవిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది ఫైర్ బ్లోయర్ల సాయంతో మంటలు ఆర్పారు. సిబ్బంది వెళ్లే లోపే సుమారు మూడు ఎకరాల మేర అడవిలో గడ్డి దగ్ధమైనట్లు అటవీశాఖాధికారులు తెలిపారు. వేసవి కాలం కావడంతో అడవిలో గడ్డిపూర్తిగా ఎండిపోయింది. అడవికి పక్కనే ఆనుకుని ఉన్న రైతుల పొలాల్లో వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేస్తున్న సమయంలో గాలివాటానికి నిప్పురవ్వలు ఎగిరిపడి అడవిలో గడ్డి కాలిపోయినట్లు అధికారులు తెలిపారు.

విరబూసిన విద్యాకుసుమాలు

కష్టపడితే సాధించలేనిదేదీ లేదంటూ నిరూపించారు ఉమ్మడి జిల్లాకు చెందిన యువతీ యువకులు. ఓవైపు కుటుంబ భారం మోస్తూ.. మరోవైపు ఉద్యోగ సాధనలో ముందుండి విజయ తీరాలను చేరారు. పేదరికాన్ని జయించాలంటే చదువుతోనే సాధ్యమని నిరూపించి, గురుకుల ఫలితాల్లో విజయం సాధించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల టీచర్, జూనియర్, డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన పలువురి వివరాలు..

- కన్నవారి కలలు నిజం చేసిన పేదింటి బిడ్డలు
- ఓవైపు పనిచేస్తూనే.. మరోవైపు పట్టువదలని సంకల్పం
- ఒకటి.. రెండు.. మూడు.. ఇలా పలు ఉద్యోగాలకు ఎంపిక
- రాష్ట్రస్థాయిలో మొదటి.. ద్వితీయ.. తృతీయ ర్యాంకులు
- గురుకుల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి జిల్లా వాసులు

గురుకుల జేఎల్ ఉద్యోగానికి ఎంపికైన హరికృష్ణ


హరికృష్ణ

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన ఎ.హరికృష్ణ ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. కాగా 2017లో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయ నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగం సాధించి దేవరకొండ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన విజయానికి సహకరించిన తన భార్య, కుటుంబ సభ్యులకు హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కాగా హరికృష్ణ సోదరి ఎ.సామ్రాజ్యం 2008లో, ఎ.వరలక్ష్మి 2012లో ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

మూడు ఉద్యోగాలు సాధించిన రాజేష్


కొడిదల రాజేష్

భానుపురి: తెలంగాణ గురుకులాలకు ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందని కొడిదల రాజేష్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న, చందుపట్లలో హెచ్‌డబ్ల్యూవోగా పనిచేస్తున్న కొడిదల ఉప్పలయ్య కుమారుడు కొడిదల రాజేష్ పీజీటీ బయోలాజీ స్టేట్ ఫస్ట్‌ర్యాంక్, జూనియర్ లెక్చరర్ రాష్ట్రస్థాయి 8వ ర్యాంకు, టీజీటీలో 12వ ర్యాంకు సాధించారు. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలు..


బోడ సంధ్య

నాగారం: నాగారం మండలం ఫణిగిరి గ్రామానికి చెందిన బోడ సంధ్య ఇటీవల వెలువడిన గురుకుల ఉపాధ్యాయ నియామక ఫలితాల్లో పీజీటీ, జేఎల్ రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సంధ్య ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమై ప్రభుత్వ ఉద్యోగం సంపాదించింది. ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సొంతం..


రాజుల సరిత

పెన్‌పహాడ్: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం భక్తాళాపురం ఆవాస గ్రామపంచాయతీ యర్రంశెట్టిగూడెం గ్రామానికి చెందిన రాజుల సరిత నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. యర్రంశెట్టిగూడెం గ్రామానికి చెందిన రాజుల జాన య్యపద్మ దంపతులకు కుమారుడు సతీష్, కుమార్తె సరి త ఉన్నారు. ఇటీవల విడుదలయిన ఫలితాల్లో గురుకుల తెలుగు విభాగంలో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్‌గా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. సరిత మాత్రం గురుకుల డిగ్రీ లెక్చరర్‌గా జాయిన్ అవుతానని తెలిపింది.

ఎలాంటి కోచింగ్ లేకుండానే..


శ్రీపాద సరిత

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రానికి చెందిన శ్రీపాద సరిత అనే మహిళ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రంలో ఎకనామిక్స్ సబ్జెక్టులో 50వ ర్యాంకు సాధించారు. ఇప్పటివరకు ఎలాంటి కోచింగ్ లేకుండా ఈ మూడు ఉద్యోగాలు పొందడం విశేషం. తన భర్త సహకారంవల్లే తాను ఈ స్థాయికి చేరానని చెప్పారు.

విజయతీరానికి గిరిజన బిడ్డ


రమావత్ అంజలి

తిరుమలగిరి(సాగర్): పేదరికమే తనలో పట్టుదల పెంచి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా చేసిందని గిరిజన బిడ్డ రమావత్ అంజలి తెలిపారు. మొక్కవోని పట్టుదల, ఆత్మవిశ్వాసం ముందు పేదరికం ఓడిపోతుందని, విజయం సిద్ధిస్తుందని ఆమె నిరూపించారు. వివరాల్లోకి వెళితే.. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని పెద్దబావితండాలో నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన రమావత్ భీముడు, లక్ష్మాల కుమార్తె అంజలి ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో స్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల స్థాయిలో ఆమె ఫిజికల్ డైరెక్టర్‌గా మూడు ఉద్యోగాలు సాధించారు. అంజలి తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని స్థానిక తండాలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్తిచేశారు. అనంతరం గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో దామరచర్లలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో సీటు సాధించి 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు అక్కడే పూర్తి చేశారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాలో 2012లో బీజెడ్‌సీలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం 2015లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎంపీఈడీ పూర్తి చేశారు. తర్వాత 2016లో ఫుట్‌బాల్ కోచ్, ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న లింగానాయక్‌తో వివాహమైంది.

మొక్కవోని దీక్షతో... సమస్యలు దాటుకుంటూ..

అంజలికి దంపతులకు ఇద్దరు మగ సంతానం కలిగారు. కుటుంబ పోషణ నిమిత్తం భార్యభర్తలిద్దరూ వరంగల్‌లో నాలుగేళ్లు, హైదరాబాద్‌లో ఒక ఏడాది పలు పాఠశాలల్లో పనిచేశారు. ఈ క్రమంలో లింగానాయక్‌కు చండూరు ప్రభుత్వ ఎస్టీ గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ విభాగంలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగం లభించడంతో నల్లగొండకు వచ్చారు. దీంతో తన భర్త ఉదయం ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత ఇద్దరు చిన్నారులను ఆయన వద్ద ఉంచి పోటీ పరీక్షల ప్రిపరేషన్‌కోసం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రతీరోజు వచ్చి చదువుకున్నారు. చిన్న నాటి నుంచి పడిన కష్టాలు నేటి విజయంతో సంతృప్తినిస్తున్నాయని అంజలి చెప్పారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో మల్టీజోన్-2లో జూనియర్, డిగ్రీ గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా మహిళా విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. దీంతోపాటు గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా నూ ఎంపికై ఆరు నెలల్లోనే పట్టుదలతో చదివి మూడు ఉద్యోగాలను సాధించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించానని, అవి రద్దు కావడంతో తిరిగి ప్రిపేర్ అవుతున్నట్లు తెలిపారు. పేదరికంలో పుట్టిన తనను చదివించిన తల్లిదండ్రులు, తన భర్త సహకారం తాను విజయం సాధించడంలో ఎంతో ఉందన్నారు. ఇదిలా ఉంటే ఒకానొక సమయంలో చదువు ఆగిపోయే వేళ తన సోదరుడు నాగ సైదులు తన ప్యాకెట్ మనీ ఇచ్చి, చదువు కొనసాగేలా చేశారని అంజలి తెలిపారు. తన అక్క, బావలు శ్రీరాములు, సైదమ్మలు ఆర్థికంగా చదువుకునేందుకు సహాయం చేశారని వివరించారు.

గ్రూప్-1 ఉద్యోగాన్ని సాధించడమే లక్ష్యం : రమావత్ అంజలి

మేము నిరుపేద కుటుంబం నుంచి వచ్చాం. నా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటూ నన్ను చదివించారు. వారి కష్టాలను తీర్చడానికి నేను, నా భర్త లింగానాయక్ ప్రోత్సాహంతో మూడు ఫిజికల్ డైరెక్టర్ ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాను. గ్రూప్-1 సాధిస్తాననే నమ్మకం నాకు ఉంది.

అమ్మ బంగారం అమ్మి చదివించింది..


దొంతగాని స్వామిగౌడ్

నల్లగొండ: చిన్నప్పటి నుంచే తనను పేదరికం వెంటాడిందని.. అయినా సరే తన తల్లి వద్ద ఉన్న కొద్దిపాటి బంగారం కూడా అమ్మి తనను చదివించిందని చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన దొంతగాని స్వామిగౌడ్ తెలిపారు. దొంతగాని రాజలింగం, గోపమ్మల దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇందులో కుమారుడు స్వామిగౌడ్‌కు చిన్నప్పటి నుంచి చదువంటే మక్కువ ఎక్కువ. దీంతో చిన్నప్పటి నుంచి చదువులో ముందు వరుసలో ఉంటూ ప్రతిభ చాటేవారు. మొదటి నుంచి ఏడో తరగతి వరకు చండూరు మండలం కొండాపురం, పదో తరగతి వరకు పుల్లెంల, తర్వాత ఇంటర్ చండూరు, డిగ్రీ నల్లగొండ నీలగిరి కళాశాలలో చదివారు. తర్వాత ఉద్యోగ సాధనకోసం నల్లగొండలో రూం అద్దెకు తీసుకొని జిల్లాకేంద్ర గ్రంథాలయంలో చదువుకున్నారు. అయితే అంతకుముందు పలు ప్రైవేట్ పాఠశాలల్లో టీచర్‌గా పనిచేశారు. 2019 సమయంలో కరోనా ఎంతో మంది ఉపాధ్యాయులను రోడ్డున పడేసింది. ఆన్‌లైన్ తరగతుల పేరుతో టీచర్లను తొలగించిన పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల నిర్ణయంతో ఎంతో మంది ఇబ్బందులు పడ్డారు. అలాంటి ఇబ్బందులు పడిన వారిలో స్వామి కూడా ఒకరు. ఏదైనా ఉద్యోగం సాధించి, తన సత్తా చాటాలనే సంకల్పంతో ముందుకు సాగారు. అలా కష్టపడి చదివి గురుకుల ఫలితాల్లో పీజీటీ సోషల్ విభాగంలో రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించారు. టీజీటీలోనూ ఉద్యోగ ఎంపికకు ధ్రువపత్రాల పరిశీలన కోసం పిలిచినా మానవతా దృక్పథంతో వెళ్లలేదు. ఎందుకంటే ఆయన వెళితే.. మరో నిరుద్యోగి ఉద్యోగం రాకుండా, ఆ పోస్ట్ బ్యాక్‌లాగ్ మిగిలే అవకాశం ఉండడంతో స్వామిగౌడ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆయనను జిల్లా గ్రంథాలయ ఉద్యోగార్థులు అభినందించారు. కాగా ఆయన పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యే సమయంలో తన భార్య తేజస్వి సపోర్ట్ మరిచిపోలేనిదని, అదే విధంగా తన గ్రామం నుంచి కొంత మంది ఆర్థికంగా సపోర్ట్ చేసి వెన్నంటి నిలిచారని స్వామిగౌడ్ చెప్పుకొచ్చారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించినట్లు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను కావడమే తన లక్ష్యమని చెప్పారు.

ఒకేసారి నాలుగు ఉద్యోగాలు


వినోద్ కుమార్

చండూరు రూరల్: చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బత్తుల మల్లేష్, యాదమ్మల కుమారుడు బత్తుల వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గురుకుల జూనియర్ లెక్చరర్, గురుకులం పీజీటీ ఉద్యోగ ఫలితాల్లో సత్తాచాటి ఉద్యోగాలు సాధించాడు. అంతేకాకుండా టీజీటీ (తెలుగు, సోషల్)లలో రెండు ఉద్యోగాలు సాధించి, వాటి సర్టిఫికెట్ల పరిశీలనకు వెళ్లకుండా ఇతరులకు అవకాశం కల్పించాడు. మొత్తంగా ఒక్కరు ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించి మండలంలోని నిరుద్యోగులకు, యువతకు ఆదర్శంగా నిలిచాడు. తన తండ్రి మరణించిన తర్వాత తల్లి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కొడుకుని చదివించింది. దీంతో తన తల్లి కష్టపడి చదివించినందుకు ఆ కష్టానికి ప్రతిఫలం సాధించి చూపించాడు వినోద్‌కుమార్.

జేఎల్ ఫలితాల్లో స్టేట్ రెండో ర్యాంకు

ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన రామరాజు


రామరాజు

నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లాకు చెందిన రామరాజు ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించాడు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో కన్నెబోయిన రామరాజు రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అక్కలాయిగూడేనికి చెందిన కన్నెబోయిన సైదులు, సైదమ్మల కుమారుడు రామరాజు ఏడాది కాలంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల కళాశాల పరీక్షలు రాశారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో కెమిస్ట్రీ విభాగంలో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించాడు. అదేవిధంగా ఫిబ్రవరి 28న ప్రకటించిన గురుకుల డిగ్రీ కళాశాల లెక్చరర్ ఫలితాల్లోనూ ఎంపికయ్యారు. ఇందులో రాష్ట్రస్థాయి ఆరో ర్యాంకు సాధించాడు. అదేవిధంగా గురుకుల పాఠశాలలో పీజీటీ విభాగంలో ఫిజికల్ సైన్స్‌లో రాష్ట్రస్థాయి 9వ ర్యాంకు సాధించాడు. ఒకే సారి మూడు ఉద్యోగాలు సాధించడంతో జిల్లాకేంద్ర గ్రంథాలయంలో ఉద్యోగ అభ్యర్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

చిన్న నాటినుంచే పేదరికంలో..

కన్నెబోయిన రామరాజుది నిరుపేద కుటుంబం. ఆయన తండ్రి కొంతకాలం క్రితం మృతి చెందగా, కుటుంబ పోషణ ఆయనపైనే పడింది. ఓవైపు ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తూనే, మరోవైపు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. గ్రూపు-2, గ్రూపు-1తోపాటు డీఎస్సీ, గురుకుల కళాశాలల పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. ఇందులో భాగంగా ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించాడు. ఇదిలా ఉంటే రామరాజు తన భార్యను కూడా చదివించుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

అడ్డంకులను ఎదుర్కొని..


నక్కపోతు జ్ఞానేశ్వర్

నల్లగొండ: ఉద్యోగ సాధన కోసం ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని, తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు చండూరు మండల కేంద్రానికి చెందిన జ్ఞానేశ్వర్. నక్కపోతు లింగయ్య, పద్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా.. చిన్న కుమారుడు జ్ఞానేశ్వర్ ఓవైపు పాఠశాలల్లో చదువు చెబుతూ.. మరోవైపు ఉద్యోగ సాధనకు కృషి చేశాడు. గత ఏడాది కాలంగా నల్లగొండ జిల్లాకేంద్ర గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతూ, గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. తన ఉద్యోగ సాధనకు సహకరించిన తల్లిదండ్రులు, మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. నల్లగొండలోని ఓ అద్దె గదిలో ఉంటూ.. జిల్లాకేంద్ర లైబ్రరీకి వచ్చి చదువుకున్నానని, ఈ సమయంలో తనకు ఆర్థికంగా సహకరించిన తన స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల ఫలితాల్లో రైతుబిడ్డల ప్రతిభ

కనగల్: మండలంలోని రేగట్టే, మంచినీళ్లబావి గ్రామాలకు చెందిన నిరుపేద రైతు కుటుంబాలకు చెందిన జక్కలి నగేష్, మేక నరేందర్‌రెడ్డి గురుకుల ఉద్యోగాలను సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. పేద కుటుంబాలకు చెందిన వీరు కష్టాలను అధిగమించి పట్టుదలతో చదివి లక్ష్యాన్ని అందుకున్నారు. నగేష్ గురుకుల జేఎల్ ఫిజిక్స్, నరేందర్‌రెడ్డి గురుకుల టీజీటీ ఇంగ్లీష్ కొలువులకు ఎంపికయ్యారు. కాగా గురుకుల ఉద్యోగాలను సాధించిన వీరికి పలువురు అభినందలు తెలిపారు.


జక్కలి నగేష్, మేక నరేందర్‌రెడ్డి

పేదింటి కుసుమాలు సౌజన్య, భువన


మారగోని సౌజన్య, భువన

భువనగిరి రూరల్: పేదరికాన్ని జయించి ఇద్దరు అక్కా చెల్లెల్లు ధృఢ సంకల్పంతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి గురుకుల పాఠశాల లైబ్రేరియన్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. భువనగిరి పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబం మారగోని రమేష్, చంద్రకళ దంపతులకు సౌజన్య, భువనలు జన్మించారు. తండ్రి మారగోని రమేష్ 2015లో అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందాడు. అయితే చంద్రకళ భువనగిరి పట్టణంలోని కుట్టు మిషన్ వృత్తి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. సౌజన్య, భువన ఒక సంవత్సరం వయస్సు వ్యత్యాసం అయినప్పటికీ వారిద్దరు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు భువనగిరిలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో, అనంతరం బీటెక్, బీఈడీ, బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీ, బీపీఈడీ, ఎంపీఈడీ, ఎంఏ సోషియాలజీలో మాస్టర్ డిగ్రీలు సాధించారు.

అక్కాచెల్లెల్లు సౌజన్య, భువన నేపథ్యం..

సౌజన్యకు భువనగిరి మండలంలోని నందనం గ్రామానికి చెందిన సుర్వి వెంకటేష్‌తో 29 డిసెంబరు 2018లో వివాహం జరిగింది. వీరికి మూడున్నరేళ్ల కుమార్తె ఉంది. గృహిణిగా ఇంట్లోనే ఉంటూ భర్త వెంకటేష్ ప్రోత్సాహంతో గురుకుల పాఠశాల లైబ్రేరియన్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యింది. అదేవిధంగా చిన్న కుమార్తె భువనకు మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన కొరటికంటి శ్రీధర్‌గౌడ్‌తో 23 మే 2019న వివాహం జరిగింది. వీరికి 15 నెలల కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. అయితే ఆమె 2019 జూలై నుంచి బీబీనగర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోంది. సౌజన్య, భువనలు 2023 ఆగస్టు 7న నిర్వహించిన గురుకుల పాఠశాలల లైబ్రేరియన్ పరీక్షలు రాసి, ఇటీవల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలు


మల్లేష్

డిండి: పోటీ ప్రపంచంలో ఒక్క ఉద్యోగం సాధించడమే కష్టంగా ఉన్న తరుణంలో డిండి మండల కేంద్రానికి చెందిన నల్లగంతుల మల్లేష్ ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో మల్లేష్ జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సాధించాడు. పేద కుటుంబానికి చెందిన మల్లేష్ తండ్రి 15 సంవత్సరాల క్రితం చనిపోగా, తల్లి పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రులులేని బాధను దిగమింగుకుంటూ మల్లేష్ ప్రభుత్వ ఉద్యోగం సాధించారు.

ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు


సిలివేరు సుష్మ

చిట్యాలరూరల్: ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగా లు సాధించింది చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన యువతి. పెద్దకాపర్తికి చెందిన సిలివేరు గోపాల్, చంద్రకళకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో సుష్మ చిన్న కుమార్తె. పదో తరగతి వరకు స్థానికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జడ్పీహెచ్ఎస్ఎస్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి, ఇంటర్‌ను నల్లగొండలోని ప్రైవేటు కళాశాలలో చదవింది. డిగ్రీ హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలలో, ఎంఏ ఇంగ్లీష్ ఉస్మానియా యూనివర్సిటీలో దూరవిద్య ద్వారా పూర్తి చేశారు. ప్రస్తుతం సుష్మ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పేదకుంటుంబం కావడంతో తండ్రి గోపాల్ కూలీ పనులు పనులు చేస్తూ తన ముగ్గురు కుమార్తెలకు ఉన్నత విద్యనందించారు. పెద్ద కుమార్తె వివాహం కాగా రెండో కుమార్తె డిగ్రీ పూర్తిచేసి తల్లిని చూసుకుంటూ ఉంటుంది. చిన్న కుమార్తె సుష్మ ప్రైవేటు లెక్చరర్‌గా చేస్తూనే నోటిఫికేషన్ విడుదల కాగానే దరఖాస్తు చేసి పరీక్ష రాయగా గత నెల 29న విడుదలైన ఫలితాల్లో ఒకేసారి జూనియర్ లెక్చరర్‌గా, పీజీటీ, టీజీటీగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకుంది.

ఇటు ఇంటి బాధ్యత... అటు ఉద్యోగం సాధించాలన్న పట్టుదల


కడారు పద్మ

మోత్కూరు: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని నిరూపించారు మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన కడారు పద్మ. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఆమెకు వివాహం జరిగి అత్తవారింటికి వెళ్లింది. గృహిణిగా తన బాధ్యత నిర్వర్తిస్తూనే భర్త సహకారంతో డిగ్రీ పూర్తిచేసింది. చదువుకుని ఉద్యోగం సంపాదించాలన్న లక్ష్యంతో భర్తకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటూ, కుమారున్ని చదివించుకుంటూనే ఇంగ్లీష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేసింది. ఆ తర్వాత ఉద్యోగంకోసం ప్రయత్నించి, పోటీ పరీక్షలు రాసి ఇటీవల విడుదల అయిన గురుకుల ఫలితాల్లో 394వ ర్యాంకు సాధించి సాంఘీక సంక్షేమ పాఠశాల పీజీటీ సోషల్ స్టడీస్ టీచర్‌గా ఎంపికై గురువారం నియామక పత్రం అందుకుంది. మోత్కూరు ప్రగతి విద్యాలయంలో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, భువనగిరి నవభారత్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఓ వైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే మరో వైపు చదువు కొనసాగించి, పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఆమెను కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో స్టేట్ మొదటి ర్యాంక్


మాసంపల్లి హరికృష్ణ

వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామానికి చెందిన మాసంపల్లి హరికృష్ణ ఫిబ్రవరి 28వ తేదీన ప్రకటించిన గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించాడు. మాసంపల్లి శ్రీరాములు, జానమ్మ దంపతుల కుమారుడు హరికృష్ణ కొంతకాలంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గురుకుల డిగ్రీ లెక్చరర్ పరీక్ష రాసి, అందులో ప్రతిభ కనబర్చాడు. ఓపెన్ కేటగిరీల్లో మ్యాథ్స్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించాడు. అదే విధంగా గురుకుల పాఠశాలలో పీజీటీగా, గ్రూప్-4లో 544వ ర్యాంక్ సాధించాడు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందని, ప్రొఫెసర్ కావడమే తన లక్ష్యమని చెప్పారు.

రాజకీయాలపై ఆసక్తి లేదు

- సినీ నటుడు సుమన్


అభిమానులతో సినీ నటుడు సుమన్

సూర్యాపేట రూరల్, మార్చి 3: రాజకీయాలపై తనకు ఎలాంటి ఆసక్తి లేదని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని కరాటే కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని ఓ హోటల్‌లో కొద్ది సేపు ఆగారు. ఆయనకు సుమన్ యువసేన జిల్లా అధ్యక్షుడు గుండా వెంకన్న స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ విషయమై విలేకరులు ఆయన్ను ప్రశ్నించగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా తాను పోటీ చేయటంలేదని స్పష్టం చేశారు. తాను పోటీ చేస్తున్నానని వస్తున్న వదంతులను ఎవ్వరూ నమ్మవద్దన్నారు. ప్రస్తుతం కళామతల్లి సేవలోనే కొనసాగుతానని తెలిపారు. రాజకీయాల్లో చేరాలని ఆసక్తి కలిగినప్పుడు ఆ విషయాన్ని అందరికీ తెలియజేస్తానన్నారు.

యాదగిరిక్షేత్రంలో భక్తుల సందడి


కొండపై భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులు

యాదగిరిగుట్ట, మార్చి3: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్య సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవురోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా దేవదేవుడి దర్శనాల కోసం తరలివచ్చారు. భక్తజనుల హరిహరుల నామస్మరణలతో క్షేత్రం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది. ఆలయ తిరువీధులు, ఆర్జిత సేవా మండపాలు, ఉభయ దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల విక్రయశాల క్యూలైన్లు భక్తనులతో కోలాహలంగా కనిపించాయి. సుమారు 30వేలకు పైగా మంది భక్తుల క్షేత్రాన్ని సందర్శించినట్టు, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.39,55,896 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి ప్రసాదాల విక్రయం ద్వారా రూ.17.23లక్షల ఆదాయం సమకూరిందని, ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా కొనసాగిన బ్రేక్ దర్శనాల్లో సుమారు 1136 మంది భక్తులు ఇష్టదైవాన్ని దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ యాత్రాజనుల రద్దీ నెలకొంది. పాతగుట్ట ఆలయంలో స్వయంభువులను దర్శించుకుని సేవోత్సవాల్లో పాల్గొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ తిరువీధుల్లో పిల్లాపాపలతో బస ఏర్పాటు చేసుకుని సేదతీరారు.

శాస్త్రోక్తంగా నిత్యారాధనలు

యాదగిరీశుడికి ఆదివారం నిత్యారాధనలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలో విశ్వక్సేనుడికి తొలిపూజలతో సుదర్శన హోమం, నిత్యతిరుకల్యాణపర్వాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో జరిపారు.

మత సామరస్యానికి నిలయం తెలంగాణ : వేముల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, మార్చి 3: మత సామరస్యానికి కేంద్రంగా తెలంగాణ ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సయ్యద్ సయ్యదా బేగం ఆర్థిక సహకారంతో నిర్మించిన చిట్యాలలోని జల్సా ఇస్తేఖ్బాలే రంజాన్ బమోఖా ఇఫ్తితాహ మదీనా మసీదును ఆదివారం ఢిల్లీ జమాతె ఉలెమా ఇహింద్ అధ్యక్షుడు హజ్రత్ మౌలానా సయ్యద్ మహమూద్ అసద్ మదనీ సాహెబ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నో మతాలు, కులాల వారు స్నేహపూరితంగా మెలుగుతున్నా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఆధ్యాత్మిక ఆలోచనలు మానసిక ప్రశాంతత ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ముఫ్తీ సిద్ధిక్ సాహెబ్, ఖరేషి ఖాజా, మౌలానా పహీమొద్దీన్ ఎస్‌కె ఇబ్రహీం, ఎండీ జమీరొద్దీన్, ఎండీ శుకూర్, అబ్దుల్ సయ్యద్ ముఫీ, ఎస్‌కె ముబీన్, సయ్యద్ అన్వర్ సదర్, ఎస్‌కె అన్వర్ పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ పనులు పూర్తిచేయాలి

చింతపల్లి, మార్చి 3: ధరణి పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు అన్నారు. చింతపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ధరణి పనులను పరిశీలించారు. మండలంలో ధరణి పెండింగ్ పనులకు సంబంధించిన వివరాలను ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ. అర్షద్‌ను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పెండింగ్ పనులను ఈ నెల 9లోగా పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. అనంతరం మండలంలోని గొల్లపల్లి, రాయినిగూడెం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్డీవో వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ. అర్షద్, ఆర్ఐ యాదయ్య తదితరులు ఉన్నారు.

పేరూరు శివాలయ చైర్మన్‌గా కొండారెడ్డి



కొండారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హాలియా, మార్చి 3: అనుముల మండలం పేరూరులోని శ్రీస్వయంభూ సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా మదారిగూడెం గ్రామానికి చెందిన రిక్కల కొండారెడ్డిని నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మకర్తలుగా జెన్న బోయిన శ్రీనయ్య, దుండిగల పెదనర్సింహ, యడవల్లి సునీత, జానపాటి వెంకన్న, కొండోజు సైదాచారి, అంగోతు పాండు నాయక్, రాకేష్‌శర్మను నియమిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటనారాయణ తెలిపారు. పాలక మండలి సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. కార్యక్రమానికి సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

'ఆదర్శ నియోజకవర్గమే రాజగోపాల్‌రెడ్డి లక్ష్యం'

మునుగోడు రూరల్, మార్చి 3: మునుగోడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లక్ష్యమని డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్వకుంట్లలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల్లోనే మునుగోడులో ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడంతో పాటు రోడ్లకు ఇరువైపులా మురుగు కాల్వలు, ఫుట్‌పాత్ నిర్మాణంతో పాటు సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు రూ.24 కోట్లు మంజూరు చేయించారన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లకు రూ.4కోట్ల పైగా నిధులు మంజూరు చేయించారన్నారు. మునుగోడు నియోజకవర్గంలో చర్లగూడ, కిష్టరాంపల్లి రిజర్వాయర్ల పనులు పూర్తి చేయించడంతో పాటు వివిధ సాగునీటి వనరుల అభివృద్ధి కోసం అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారన్నారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ మేకల మల్లయ్య, మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, కుంభం యాదగిరిరెడ్డి, వెదిరే విజయేందర్‌రెడ్డి, మక్కెన అప్పారావు పాల్గొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి



రేషన్‌షాపును ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

నార్కట్‌పల్లి, మార్చి 3: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులను సకాలంలో అందజేస్తూ వినియోగదారుల మన్ననలు పొందాలని తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని చెర్వుగట్టులో నూతన రేషన్‌షాప్‌ను ఆదివారం ప్రారంభించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకే నిత్యావసరాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, రేగట్టె నవీన్‌రెడ్డి, కొండేటి వేణు, ఆర్ఐ తరుణ్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పారుపల్లి నాగరాజు, మండల అధ్యక్షుడు తేరటుపల్లి ఉపేందర్, భిక్షమయ్య, చింత సైదులు, దాసోజు కోటి పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

నార్కట్‌పల్లి, మార్చి 3: గతేడాది మండలంలోని నైబావిలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమాన్ విగ్రహానికి చందనాభిషేకం, నవగ్రహాలకు అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం వంటి పూజాధికాలను ఆలయ ప్రధానార్చకుడు గుండేపూడి జానకిరామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమ యుగేంద ర్‌రెడ్డి, సభ్యులు పైళ్ల నర్సిరెడ్డి, సోమ వెంకట్‌రెడ్డి, పైళ్ల జనార్థన్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కందకట్ల నర్సిరెడ్డి, పాశం వెంకట్‌రెడ్డి, సోమ నర్సిరెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత సాంబశివారెడ్డి

తిరుమలగిరి(సాగర్), మార్చి 3: మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కొత్తపల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాంసాని సాంబశివారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాగార్జునసాగర్‌లో ఆదివారం సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిల సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సాంబశివారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, సీనియర్ నాయకులు శాగం పెద్దిరెడ్డి, గజ్జల జనార్ధన్‌రెడ్డి, శాగం వెంకట్‌రెడ్డి, కూన్‌రెడ్డి కృష్ణారెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



చింతపల్లిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చింతపల్లి, మార్చి 3: మండలకేంద్రంలోని శ్రీషిర్డీసాయిబాబా దేవాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. నల్లగొండ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాల నుంచి సుమారు 800 మంది కంటి శిబిరానికి హాజరయ్యారు. హైదరాబాద్ ఎల్‌వీ. ప్రసాద్ కేర్ వైద్యశాలకు చెందిన కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్‌లు చేయడంతోపాటు కంటి అద్దాలను కూడ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి చైర్మన్ మంచికంటి ధనంజయ్య, ఊరే కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయిటిపాముల బ్రాంచి పోస్టుమాస్టర్ ఆత్మహత్య

కట్టంగూరు, మార్చి 3: మండలంలోని అయిటిపాముల గ్రామ బ్రాంచి పోస్టుమాస్టర్ దేవరపల్లి యమున(30) ఆదివారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన పోస్టుమాస్టర్ యమున కొంతకాలం నుంచి అయిటిపాముల బ్రాంచి పోస్టమాస్టర్‌గా పనిచేస్తోంది. అయిటిపాములలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. ఆదివారం ఉదయం నుంచి బయటకు రాకపోవడం, తలుపులు తీయకుండా ఉండడంతో గ్రామస్థులు ఆమె బంధువులకు ఫోన్ చేశారు. బంధువులు వచ్చి చూడగా మధ్యాహ్నం సమయంలో యమున ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందింది. ఆమె మృతికి కారణాలు తెలియరాలేదు. యమున మృతిపై అనుమానం ఉందని ఖమ్మంకు చెందిన ఆమె సోదరుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. యమున అవివాహితురాలు.



మాడ్గులపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ



కొండమల్లేపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న నాయకులు



చింతపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ



దేవరకొండలో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్



నాగార్జునసాగర్‌లో...



హాలియాలో చుక్కలు వేస్తున్న సిబ్బంది

పల్స్ పోలియో విజయవంతం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్ వర్క్)

జిల్లావ్యాప్తంగా ఆదివారం చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద, పాఠశాలల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద, మొబైల్ టీంల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చిట్యాల మండలంలో నల్లగొండ డివిజనల్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి గ్రామాల్లో కార్య క్రమాన్ని పర్యవేక్షించారు. మాడ్గులపల్లిలో ఎంపీపీ పోకల శ్రీవిద్య చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. డిండిలో బస్టాండ్ ఆవరణలో ఎంపీడీవో డానియల్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నార్కట్‌పల్లిలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, శాలిగౌరారంలో మండల వైద్యాధికారి శిల్ప పల్స్ పోలియో చుక్కలు వేశారు. దేవరకొండలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృష్ణకుమారి, జిల్లెపల్లిలో ప్రత్యేక అధికారి కరుణసాగర్ పోలియో చుక్కలు వేశారు. కొండమల్లేపల్లిలో మండల వైద్యాధికారి ఉషారాణి, కట్టంగూరులో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత కార్యక్రమాన్ని ప్రారంభించారు. చింతపల్లిలో ఎంపీపీ కొండూరు భవానిపవన్‌కుమార్, జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, చిట్యాలలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మర్రిగూడలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్దఅడిశర్లపల్లి మండలం కోదండపురంలో కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. గట్టుప్పల్‌లో జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, హాలియాలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుమలగిరి (సాగర్), నాగార్జునసాగర్ మండలాల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మిర్యాలగూడ పట్టణంలో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేస రవి, డాక్టర్ సుచరిత చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. నకిరేకల్ పట్టణంలని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే వేముల వీరేశం చిన్నారికి పల్స్‌పోలియో చుక్కలు వేసి కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తల్లిదండ్రులు పల్స్ పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని ఆయన సూచించారు.



నకిరేకల్‌లో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే వీరేశం



నార్కట్‌పల్లి: చుక్కలు వేస్తున్న ఎంపీపీ సూదిరెడ్డి



తిరుమలగిరిసాగర్‌లో చిన్నారికి చుక్కలు వేస్తున్న ఏఎన్ఎం



చిట్యాలలో చుక్కలు వేస్తున్న మునిసిపల్ చైర్మన్

ఘనంగా జడ్పీటీసీ రాంరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, జడ్పీటీసీ, ఎంపీపీ కాంగ్రెస్ నాయకులు

తిప్పర్తి, మార్చి 3: తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల, జిల్లాలోని పలు విభాగాల అధికారులు, మండల అధికారులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని మర్రిగూడెంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేక్ కట్ చేసి జడ్పీటీసీ పాశం రాంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిప్పర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆయన అభిమానులు కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీలింగారావు, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సుధీర్, జాకటి మోష, రొట్టెల రమేష్, ఉయ్యాల నాగరాజు, నలపరాజు శ్రీనివాస్, ఎండీ. బాబర్, ఆదిమూళ్ళ ప్రశాంత్, ఎద్దు ఉపేందర్ తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



చిట్యాలలో ఎండిన పొలాలు పరిశీలిస్తున్న నాయకులు

దామరచర్ల, మార్చి 3: ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని నర్సాపురం, శాంతినగర్, తిమ్మాపురం, కల్లేపల్లి గ్రామాల్లో ఎండిపోయిన పంటలను ఆదివారం పరిశీలించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాల అడుగంటి నీరందక పంటలు ఎండిపోవడంతో రైతులు రైతులు పెట్టిన పెట్టుబడులు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాపానాయక్, దయానంద్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, బాలు, విజయ్, కామ్లా, పాండు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: భూగర్భజలాలు అడుగంటడడంతో వరి పంట పొలాలకు నీరందక ఎండిన వరిచేలను పశువుల మేతకు వేయడమేనా అని రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం, ఐత రాజు నర్సింహ ప్రశ్నించారు. ఆరెగూడెంలో ఎండిన వరిపొలాలను ఆదివారం సీపీఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. భూగర్భ జలాలు అడుగండడంతో వేసవి ఆరంభంలోనే పంటపొలాలు ఎండుతున్నాయన్నారు. సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూడా ప్రభుత్వం మిన్నకుండపోవడం దారుణమన్నారు. వ్యవసాయానికి సాగునీటిందించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని గ్రామాలకు పంపించి పంటల పరిస్థితిగతులను తెలుసుకోవాలని, పంటనష్టాలను నమోదు చేసుకుని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎండిన వరి చేలకు ప్రభుత్వ ఎకరాకు రూ.20వేల నష్టపరిహారాన్ని అందజేసి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అవిశెట్టి శంకరయ్య, ఆరూరి శ్రీను, లడె రాములు, సాపిడి అంజనేయులు, నరేష్, లక్ష్మమ్మ, మోటె కిష్టమ్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



భవాని సమేత ఉమా మహేశ్వర స్వామి ఆలయం

శాలిగౌరారం, మార్చి 3: బైరవునిబండలోని గంగా భవాని సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలకరించారు. 50ఏళ్ల నుంచి భక్తుల కొంగు బంగారంగా ఆలయం విరాజిల్లుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి 11 వరకు బ్రహ్మోతస్సవాలతో పాటు జాతర కూడా జరగనుంది. ఈ ఆలయ ప్రాంగణంలో గంగమ్మ, శివాలయం, రేణుక ఎల్లమ్మ, అయ్యప్పస్వామి, ఆంజనేయ స్వామి, రామాలయం, గంగా జల బావి తదితర ప్రసిద్ధి గాంచిన ఆలయాలోని దేవతలను భక్తులు దర్శించుకుంటారు. 7న మహాగణపతి పూజతో ఉమా మహేశ్వరుల దేవతామూర్తులు కొండపైకి వస్తారు. 8న మహాశివరాత్రి సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకాలు, అగ్నిప్రతిష్ట, రాత్రి 12గంటలకు శ్రీఉమా మహేశ్వరుల కల్యాణం, తెల్లవారుజామున 3గంటలకు తలంబ్రాల మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. 9న రుద్ర హోమం, చండీహోమం, శ్రీలలిత సహస్ర నామపరాయణం, 10న రేణుక యల్లమ్మ బోనాలు, రాత్రి 10గంటలకు హరికథ కాలక్షేపం, తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండాల కార్యక్రమం, 11న దేవాలయం చుట్టూ ఎడ్ల బండి గిరి ప్రదక్షణలు నిర్వహిస్తారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 3: మండలంలోని కోదండపురం గ్రామంలో వెలిసిన పద్మావతీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం తెల్లవా రుజామున ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీనివాసచార్యులు బృందంచే హోమం పూజ, గణపతిపూజ నిర్వహించారు. కల్యాణంలో 1051 జంటలు పాల్గొన్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు పట్టు వస్త్రాలు, యాదగిరిగుట్ట లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం అన్నదాన కార్యాక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జడ్పీఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి, దేవా లయ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణాచారి, పోచంరెడ్డి సైదిరెడ్డి, పోలే ఇందిరామహేందర్, నక్క బిక్షమయ్య, ఇంద్రకంటి లక్ష్మయ్య, బాలబోయిన వెంకటయ్య, అర్చకులు పొందూరి శ్రీనివాసచార్యులు, వైస్ ఎంపీపీ ఆర్వపల్లి సరితనర్సింహ, జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు అలుగుబెల్లి వెంకటేశ్వరరెడ్డి, యోల్లగిరి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేరళ సీఎంపై వ్యాఖ్యలు హాస్యాస్పదం

శాలిగౌరారం, మార్చి3: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేరళ సీఎం విజయన్‌పై అవినీతి సీఎం అని అనడం హాస్యాస్పదమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో సంఘం సభ్యత్వాలను సోమవారం నమోదు చేయించారు. దేశంలోనే విద్య, వైద్యం, అన్ని రంగాల్లో అగ్రభాగంలో కేరళ రాష్ట్రం ఉందని ఐక్యరాజ్యసమితి కొనియాడిన సంగతి సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు.? ప్రాజెక్టుల పేరుతో ప్రజలను అయోమయానికి గురిచేస్తున్న కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలను స్పష్టమైన అవగాహనతో చర్చలు ఉండాలన్నారు. గత ప్రభుత్వం జలయజ్ఞం పేరుతో, ప్రాజెక్టుల పేరుతో ధనయజ్ఞం చేసిందని దానిపైన సమగ్రంగా విచారణ జరపాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వం పైన ఉందన్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ లబ్ధి కోసం చర్చలు చేసి దాన్ని రాద్ధాంతం చేస్తూ ప్రజల్ని అయోమయానికి గురి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు, మక్క బుచ్చి రాములు, చలకాని మల్లయ్య, సిరిపంగి రాములు, కల్లూరి లింగయ్య, డెంకెల లింగయ్య, పట్టేటి రాములమ్మ, తాటి పాముల పార్వతమ్మ, మక్క జానమ్మ, మంజుల, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న ప్రతినిధులు

కనగల్, మార్చి 3: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎంపీటీసీ నామ కౌసల్యనగేష్, మాజీ సర్పంచ్ అవురేశి క్రాంతి శ్రీను అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని ఎస్‌లింగోటం గ్రామంలో సంరక్ష ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం, శేఖర్ ఇనిస్టిట్యూట్, సత్యసాయి యోగాసేవా కేంద్రం ఆధ్వర్యంలో యోగా శిక్షణ, విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువకులను, రిటైర్డ్ అయిన ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కనగల్ మండల అధ్యక్షుడు నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, నీలకంఠం శేఖర్, నీలకంఠ సుధాకర్, ఎ. పరమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

త్రిపురారం: మండల కేంద్రంలోని ఆల్ఫా స్కూల్ డే సందర్భంగా ఆదివారం వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థునుల సంప్రదాయ నృత్యాలు, నాటకాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, ప్రిన్సిపాల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండి. అర్షద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎండి. శంషొద్దిన్ తెలంగాణ సచివాలయానికి బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అర్షద్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

తిరుమలగిరి(సాగర్): నేటి నుంచి రంగుండ్లతండాలో భగుడు శివాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పురోహితులు శ్రీమురళీ ఆచార్యులు, శ్రీలలిత దత్త ఉపాసకులు, రాయప్రోలు శ్రీరామ్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం గణపతి పూజ, పంచగ వ్యప్రాసన, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ట, విగ్రహ శుద్ధి, మంగళవారం మూల తంత్ర హోమం, విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం, పుష్పదివాసం, హారతి మంత్రపుష్పంద, బుధవారం విగ్రహాలకు అభిషేకం, యంత్రప్రతిష్ట, విగ్రహ, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి దర్శనం కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు లచ్చిరాంనాయక్ సాదు, హేమ్లానాయక్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

నల్లగొండ టౌన్: నల్లగొండ టూటౌన్ సీఐగా డానియెల్ నియమితులయ్యారు. ఈయన ట్రాఫిక్ సీఐగా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో ట్రాఫిక్ సీఐగా ఎవరిని నియమించలేదు. కాగా ఇప్పటి వరకు టూటౌన్ సీఐగా పనిచేసిన కొండల్‌రెడ్డిని హైదరబాద్‌కు బదిలీ చేశారు. మహిళ పోలీస్‌స్టేషన్ నుంచి టూటౌన్‌కు బదిలీపై వచ్చిన కొండల్‌రెడ్డి కొద్ది రోజులలోనే హైదరబాద్‌కు బదిలీ అయ్యారు. నూతన సీఐ సోమవారం బాధ్యతలను స్వీకరించనున్నారు.

శాలిగౌరారం: బైరవునిబండ గ్రామంలో ఈ నెల 7 నుంచి శ్రీ గంగాభవాని సమేత ఉమామహేశ్వర దేవస్థానం నందు బ్రహ్మోత్సవాలకు రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆదివారం బైరవునిబండ గ్రామ మాజీ సర్పంచ్ దండ రేణుక అశోక్‌రెడ్డి నల్లగొండలో కలిసి ఆహ్వానించారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు గ్రామంలో వైభవంగా జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. 8న శుక్రవారం మహాశివరాత్రి రోజున 12గంటలకు స్వామివారి కల్యాణం మూడు గంటలకు తలంబ్రాల కార్యక్రమం ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

చిట్యాలరూరల్: మండలంలోని చిన్నకాపర్తికి చెందిన వరికుప్పల మైసయ్య మృతిచెందారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ నాయకుడు దైద రవీందర్ వేర్వేరుగా మైసయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

మాడ్గులపల్లి: మండలంలోని ఆగామోత్కూర్‌లో నిర్మిస్తున్న పల్లె దవాఖానాను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని సీపీఎం మండల మండల కమిటీ సభ్యులు పతాని శ్రీను డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. దవాఖానా నిర్మాణ పనులు నాసిరకంగా, నత్తనడకగా సాగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దవాఖానా నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బంటు రాజు, బంటు సైదులు, వల్లపుదాసు, పవన్, బంటు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: వాసవీ క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఆర్డీసీ డీఎం పాల్ అన్నారు. వాసవీ గ్రేటర్ క్లబ్ ఆధ్వర్యంలో గోళ్ల మురళి, సునీత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా బస్టాండులో అన్నదాన కార్యక్రమం నిర్వహించి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేపాల శ్రీనివాస్, మల్లయ్య, జనార్ధన్, పాండు, విద్యాసాగర్, ఆనంద్, రమేష్, శేఖర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: మూడు ఉద్యోగాలకు ఎంపికైన దౌద రవిని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి ప్రాథమిక విద్యను ప్రభుత్వ బడిలో అభ్యసించిన రవి కష్టపడి చదివి పీహెచ్‌డీ పూర్తి చేశారన్నారు. ఇటీవల వెలవడిన ఉపాధ్యాయ ఫలితాలలో మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సోమయ్య, కిరణ్, అంజి, గురుకుల ప్రిన్సిపాల్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: మండల కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి దశరథ అధ్యక్షతన గుర్రంపోడ్ గ్రామశాఖ కల్లుగీత కార్మిక కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావుల సైదులుగౌడ్(పుల్లయ్య), ఉపాధ్యక్షుడిగా వడ్డెగోని సైదులుగౌడ్, ప్రధాన కార్యదర్శి వడ్డెగోని రాంబాబు గౌడ్, సభ్యులుగా రావుల శంకరయ్య, చామకూరి సత్తయ్య, సూర్య, నర్సింహ్మా, చలమల్ల మనోహర్,రావుల యాదమ్మ, పందుల మురాంతకలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

శాలిగౌరారం: ధరణిలో వినతుల ఆర్జీలపై శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఆదివారం అయినప్పటికీ కలెక్టర్ ఆదేశానుసారం కార్యాలయ అధికారులు, సిబ్బంది హాజరై ధరణిలో పెట్టుకున్న వినతులను పరిశీలించి సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు. అర్జీదారులను కార్యాలయానికి పిలిపించుకొనగా అందుబాటులో లేనివారిని ఫోన్‌లో సంప్రదించి రికార్డులో దొర్లిన తప్పులను సరిచేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో తహసీల్దార్ ఎండీ అన్వర్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ సత్తార్, ఆర్ఐ మంత్రి నవీన్ కుమార్, అజారుద్దీన్, రామచంద్రయ్య, సుధాకర్,తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని 12వ వార్డులో నిర్మించనున్న ముత్యాలమ్మగుడి శంకుస్థాపన పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, లింగాల రాములు, యాదయ్య పాల్గొన్నారు.

కట్టంగూరు: మండలంలోని పందెనపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గోదల పద్మారెడ్డి 32వ వర్ధంతిని కుటుంబ సభ్యులు ఆదివారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పద్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోదల కృష్ణారెడ్డి, యాదవరెడ్డి, గజ్జి హనుమంతు, గద్దపాటి యాదయ్య, అక్కెనపల్లి యాదయ్య, భిక్షంరెడ్డి, గోదల వరమ్మ, కొండి రుక్కమ్మ, నిర్మల, బండారు ఊర్మిలమ్మ, వసంత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.